

జీవితంలో పరాజయం పొందటం ఇది రెండవసారి. ఈ పరాజయాన్ని తలుచుకున్నప్పుడల్లా నేనే అంత దూరం తీసుకు రాకుండా వుంటే బాగుండేది అనిపిస్తుంది. కాని ఆశ అలాంటిది. అది సత్యంకన్నా తీవ్రమైనది. ఆశ తీరుతుం దని ప్రతి అడుగు త్వరత్వరగా వేశాను. ఆరోహణ నుండి అవరోహణానికి పరుగులెత్తే రాగ మాధు



ర్యాల వెంట పరుగులెత్తాను. కాని ఆ వీణా తంత్రులు తెగిపోయిన య్యాని తెలిసికోలేక పోయాను.

ఆమె ముఖం బృందావనం. ఆమె చూపులు విరిసిన మల్లెలు. ఇది ఉత్ప్రేక్ష కాదు. నిజం చెప్పాలంటే ఆమె కన్నా అద్భుతమైన, అద్వితీయమైన, అనంతమైన, శాశ్వతమైన, సత్యమైన స్త్రీ మరొకరు లేరు. ఒక మహాసౌందర్యరాశి ఆమె. ఒక మహా సౌందర్యోద్భూత ఆమె. యుగాలు ఆమెను చూస్తూ గడిపివేయవచ్చు. ఆమె ప్రక్కన యుగం క్షణ మవుతుంది. ఆవిడ నడుస్తూ పోతుంటే నా గుండె జల్లు మనేది. నా మనస్సు కంపించేది. ఎన్నోసార్లు మాట్లాడా లని ప్రయత్నించాను. కాని ఎదుటకు రాగానే మూగతనంతో బాధపడేవాడిని. బహుశ ప్రేమ హృదయా న్నావరిస్తున్న సమయం కావచ్చు ఇది. అందుకే ఆ కలవరం. నే నొక తప్పు చేస్తున్నా ననే భావం నా కేనాడూ కలగలేదు.

తెరిచిన కెమిస్ట్రీ పుస్తకాన్ని పక్కమీద పడేసి, కిటికీ వద్ద నిల్చుని విసుగ్గా నిర్లక్ష్యంగా సిగిరెట్ కాలుస్తూ కల్యాణిని గురించి చర్విత చర్వణం చేసుకుంటూ... అలా రోజులు గడుపుతూ...అప్పుడే ఒక సత్యాన్ని కనుక్కున్నాను. ఆ బాధ ఎంత తీయగా వుండేదని! అనుభవించినకొద్దీ అనుభవించాలని అదో పిచ్చి ఆకాంక్ష. ఆమె ఒక నిర్వచించలేని మరుపురాని మధురాను భూతి. ఆమె నా గుండెలో దాగిన తీయని ప్రశాంతి! ఆమెను స్పర్శించకుండానే ఈ అనుభూతిని పొందాను. ఆ నిండు చీకట్లో వెలుగు రేఖల్లా నా కంటికి సర్వావస్థల యందు దర్శన మిస్తూ వుండేది. విచిత్ర మేమిటంటే, బాధలోను, సంతోషంలోను నేను కల్యాణిని దర్శించగలిగాను. తొలి ప్రత్యూషం ఆమె! నా ఆశా లతకి ఆధారం ఆమె. బీటలు వారిన నా జీవితంలో వసంతం ఆమె! పూర్ణయామినిలో యమునా తీర సైకత సీమలలో ఆమె రాధ, నేను కృష్ణుడ్ని.

ఊహలలో దాగుడుమూత లాడేది. విలా సంగా నవ్వేది. నా గుండెని తట్టి లేపేది. నిద్రాహారాల స్పురణే లేకుండా ఆమెకై నా తపస్సు. కదలలేను. నా కీ సుషుమ్న కావాలి. ఈ సుషుమ్న ఎంత బాగుంది.

తెలివి రానీయకే

కల కరిగిపోతాది —

అని ఊహాలోకపు రాణి అయిన కల్యాణిని వేడుకున్నాను. ఇవి నా భావాలు. రచయిత నైనందుకు జీవితాన్ని కొంత సార్ధకం చేసు కున్నాను. కాని ఈ విషయంలో పరాజితు డ్నైనాను, నా హృదయపు టార్ద్రపు తంత్రు లను కల్యాణి బరువుగా మీటిన మాట నిజమే! నేనామె గుండెల్లోని జ్యోతిని కావాలి, కాని యాష్ట్రేలో పడబోయే సిగ రెట్ ముక్కని కాకూడదు. నాకు తెలుసు. ఇప్పటికి ఎంతోమంది, లెక్చరర్లతో సహా కల్యాణిముందు పరాజితులైనారు. జీవితంలో అవమానం పొంది ఏమీ చేయ లేకపోయారు.

ఇదొక వింత మాధుర్యం. స్మృతి విహాయస పథంలో తారయై కల్యాణి నా గుండెల్ని చీల్చింది. ఈ బరువైన బాధ హృదయాన్ని బ్రద్దలు చేస్తున్నది. కాని ఇలా బాధపడుతున్నకొద్దీ ఈ దుఃఖవీణని ఇంకా ఇంకా మ్రోగించా లని కృంగి కృశించిపోయి ఒకానొక గాఢ సమాధిలో కరగి నీరై ఆ మధురరాగంలో లీనమైపోవా లని వెర్రి ఆవేదన!

ఇలాంటి సమయాలలోనే నా హృదయం మూగదై పోతుంది. ఆమెను "కాలేజి బ్యూటి" అనేవారు. కాని ఎవరూ ధైర్యం చేయలేక పోయేవారు. దూర దూరంగా చేతులు నలుపుకుంటూ కూర్చోటం మినహా. లెక్చరర్ వెంకటేశానికి తగిలిన దెబ్బతో ఎవరూ సాహసించలేకపోయారు.

నా ఈ ఆవేదన తీవ్రమైంది అంతకంతకు. దాన్ని భరించలేక బయటకు వ్యక్తం చేయ లేక నిరాశతో, నిస్పృహతో ఈ చదువు మానేసి ఇక్కడ్నించి పారిపోదా మనిపిం

చేది. కాని దీని క్కారణం ఎవరితో చెప్పు కోను? ఒక స్త్రీకి జడిసి పారిపోయి వచ్చా ననా? ఇదే చిక్కు. వా శ్నెవరూ నా అంత రాత్మని దర్శించరు. కేవలం బాహ్య జీవి తాన్ని చూస్తారు. దానివలన నాకు కలిగే ప్రయోజనం వుండదు.

నా అవస్థ కల్యాణికి తెలిసినట్టు లేదు. లేక తెలిసీ తెలియనట్లు ప్రవర్తిస్తోందా? గుండెలు నిండిన బాధలు...కాలం స్థంభించి పోయిన అనుభూతి. ఈ ప్రపంచంలో బాధ ఒక్కటే స్థిరమైనది. ఈ బాధే నన్ను దేవత్వపు పొలిమేరల వరకూ లాక్కు పోయింది. దీన్ని భరించలేను. ఈ తీయని జ్వాలతో నా హృద్యోకుడ్యాలు అమృతాన్ని పొందినమాట నిజమే! కాని దీన్ని ఇంకా ఎక్కువకాలం సహించే శక్తి నాకు లేదు. ఆ అమృతపు బరువుకి నా హృదయ స్పందన మాగిపోవచ్చు! ఆ ప్రశాంత నిశ్శబ్ద జీవితంలో యామిని ఎప్పుడో వస్తుం దంటే ఎలా? ఎంతకాలమని చీకటిలో కూర్చోను? అదృశ్యంగా కల్యాణి నన్ను కవ్విస్తున్నది. ఆమెకి ఊహలు విలాస వస్తువులు. నాకు కల్యాణి కావాలి! ఎలా? ధైర్యం చేయాలి. తప్పదు.

ఈమధ్య కాలేజీలో పరధ్యానంగా వుండటం చూసి నా స్నేహితులు నన్ను హెచ్చరించారు. కాని ఏం ప్రయోజనం? కల్యాణిపై నుండి మనస్సు మరల్చుకోలేక పోయాను. మొదట్లోనే స్వరభంగమైతే ఇం కేముంది ఆపాటకు విలువ? అర్థంలేని ప్రహసనమే అవుతుంది నా జీవితం.

"ఆమె నవనీత హృదయ, నా అంతరంగ
శాంతిదేవత ఆశాపథాంతరాళ
పారిజాతమ్ము ప్రేమజీవన విభాత
కైశికీగీతి, నా తపః కల్పవల్లి!
ఆమె జగదీశ మకుటాగ్రసీమనుండి
యుర్విపై జారిన సుధామయూఖరేఖ.

ఈ వెలుగు నన్ను దరిచేర్చుతుందా? ఏమో. ఈ ఆశని నే నాశించటంలో తప్పు లేదను

కుంటాను. ఇది భగ్నమైతే నా స్థితి ఏమౌతుందో నాకు తెలుసు.

ఈ కన్య తన చిరుపదాల కింకిణీ రవములతో నా హృదయ సీమపై నాట్యం చేస్తున్నది. ఈ ఒక్క స్త్రీ కోసరమే నా హృదయంలోని ప్రతి అణువు తనని తాను పదిలపరుచుకుంది.

ఇక ఆగలేకపోయాను.

'కల్యాణీ'

'అపురూపమైన ఈ లోకపు మహోత్సవములో పాల్గొనమని నన్ను ఆహ్వానించావు. నా జన్మ తరించింది.

ఈ చిన్న పువ్వుని వాడకముందే కోసుకోవూ? నీ ఒడిలో పడుకుని ఆనంద గీతమును విననీవూ?

ఏమిటీ కవిత్వమని నవ్వుతావా? వద్దు— ఏ ప్రేమలోంచి కరుణ, ఆవేదన, బాధ ఆనందం కలుగుతయ్యో, ఆ ప్రేమయొక్క స్పర్శే ఇది. నీకు తెలీదు బహుశ. నీ వదృశ్యంగానే వుండి నా హృదయవీణను మ్రోగించావు! ఆ పాటకి శ్రుతి తప్పనీకు. నా ఆశ నిరాశ చేయకు. నా భవిష్యత్తుని కత్తిరించకు. నాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించు కల్యాణీ! నీ కోసరం నా తపస్సు. నీవల్లనే నా తమస్సు పోవాలి. మొగ్గ విచ్చీ విచ్చగానే భ్రమరమ్ములు గుంపులు గుంపులుగా వ్రాలినట్లు నిన్ను చూడగానే భావాలు మూగినయి. నిన్ను చూడకుండా ఒక్క క్షణం వుండలేను. నువ్వే నా క్షావలిసిన స్త్రీవి. నిన్ను చూసేంతవరకు నీ కోసరమే నా అన్వేషణని నాకు తెలీదు. ముడుచుకున్న పద్మాలను చంద్రకిరాణాలు వికసింపచేయగలవా? అర్ధరాత్రి. మధుర నిశ్శబ్ద ప్రశాంత యామినిలోంచి నడిచి నా స్వప్నంలో అడుగుపెట్టిన నీవు నిద్రనుండి నన్ను దూరం చేశావు. నా హృదయంలో వెలిగే నిన్ను నీవు గుర్తించగలిగితే, నీ హృదయంలోని నన్ను గుర్తించగలవు. ఇంకా నీ మౌనంతో ఎన్నాళ్ళు హింసిస్తావు? నీ మౌనానికి ప్రతిధ్వనిగా నేను బ్రతుకలేను. నే నెలాంటి వాడినో తెలుసా? ఒకసారి భగ్నత్వంతో నా పూవు పెడదమంది పోయింది. కాని నువ్వేం చేశావు? వాడిన పూవుకు మళ్ళా పరిమళ మెందుకు ఇచ్చావు? మాయని మమతల్ని రేపి నీ దారిన నీవు పోవటం న్యాయం కాదు కల్యాణీ. జవాబు వ్రాయి. నీ కోసరం, నీ జాబు కోసరం నా హృదయాన్ని వేయి కళ్ళు చేసుకుని ఎదురు చూస్తాను. లేదు మౌనంగా వూరుకుంటావా? ఆ మౌనాన్నే నాకు ప్రసాదించు, ఎవరికీ కనపడని ఏకాంత ప్రదేశానికి పరుగుపెట్టి నీవు వచ్చేదాకా ఎంతకాలమైనా నిరీక్షిస్తూ వుంటాను. ఇది నా మొదటి ప్రేమ లేఖ. దాన్ని ఆఖరు ప్రేమలేఖని చేయకు. దీనితో నా సర్వస్వము నీ కర్పించివేస్తున్నాను.

నీవాడు కావాలని కోరుకునే

కృష్ణ."



"వారే! మా ఆఫీసులో అందరి మీదా పెద్ద."

ఉత్తరం వ్రాశానేగాని మనస్సులో భయం భయంగానే వుంది. ఈ ఉత్తరానికి జవాబు వస్తుందా? వెంకటేశానికి పట్టిన గతే నాకూ పడుతుందా? ఈ ఆశా నిరాశల సంఘర్షణలో నా హృదయం నలిగిపోయింది.

రోజులు గడుస్తున్నయి. కల్యాణి నిర్లిప్తంగా వుంది. నా ఉత్తరాన్ని అసలు చూసిందా? ఏమిటీ మౌనం? ఈ మౌనాన్ని భరించలేనని తెలియదా? నా గుండె చీకటితో దట్టమౌతున్నది, కల్యాణి మౌనంతో. లేబరేటరీలోనూ, లైబ్రరీలోనూ కల్యాణి రోజూ కలుస్తూనే వుంది. నేను ఆశగా కల్యాణి వంక చూసేవాడ్ని. కాని కల్యాణి కిదేమీ పట్టలేదు. త్రుళ్ళుతూ తూలుతూ నవ్వుతూ తన ప్రయోగం చేసుకుపోయేది.

బాధగా ఇంటికి బయలుదేరాను ప్రాక్టికల్స్ కాంగానే.

"మిస్టర్ కృష్ణా!"

తలెత్తి చూశాను. కల్యాణి! చుట్టూ పది మంది ఆడపిల్లలు. నా హృదయ విపంచి కల్యాణి రాగం ఆలపించింది. నా ముఖం దీపాలు వెలిగిన కోవెల అయింది.

"వాట్ కెన్ ఐ డు ఫర్ యు?" అన్నాను.

"ఇదేమిటి?" అంది తీవ్రంగా.

"ఏమిటి?" ఈ మూడక్షరాలు రావటానికి మూడు నిమిషాలు పట్టినయి.

దాన్ని నేను గుర్తుపట్టాను. అది నేను కల్యాణికి వ్రాసిన ప్రేమ లేఖ!

కల్యాణి ముఖం చూడలేక తల దించుకున్నాను.

'మీరు బుద్ధిమంతు లనుకున్నాను. మీరు కూడ ఇలా — ' అసహనంతో కల్యాణి ముఖం ఎర్రబడింది.

నా మనస్సు కంపించింది. భావ విహ్వలతకు ఊగిపోయాను.

"ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయకండి. ఎవరికీ మంచిది కాదు" అంది.

నా కళ్ళముందరే దాన్ని పరపర చింపేసి అగ్గిపుల్ల వెలిగించి కాల్చి బూడిద చేసింది.

ఒక్క క్షణం శిలా ప్రతిమలా నిలబడి పోయాను.

చుట్టూ స్టూడెంట్స్ నవ్వుతున్నారు. ఆ నవ్వులు వినిపిస్తునే వున్నాయి.

"కాని కల్యాణీ,ఇంతకన్నా నా జీవితాన్ని దగ్ధం చేసివుంటే ఇంకా ఎక్కువ సంతోషించే వాడ్ని. పోనీలే, ఓటమి నా కలవాటే—" అన్నాను బరువుగా. అంతే, అక్కడ్నించి వెళ్ళిపోయాను.

ఇంక ఈ ఊళ్ళో వుండదలుచుకోలేదు. నా కిప్పుడు ఏ ఆశా లేదు. ఏ అదృశ్య శక్తి నా జీవితం వెంట పరుగెత్తించి ఈ ఎండమావుల వద్దకు చేర్చిందో ఆ మహత్తర శక్తే నన్ను గెంటాలి. ఆ క్షణం అలాంటిది. నా జీవితంమీదే నాకు విరక్తి కలిగింది. ఆ క్షణమే నన్ను యోగత్వపు పొలిమేరల వరకు తీసికుపోయినయి. ప్రేమయొక్క నిజస్వరూపాన్ని ఇప్పుడే దర్శించాను. అది త్యాగానికి సన్నిహితంగా వుంది. నిస్తేజంతో కృంగి కృశించి పోతా ననుకున్నాను. కాని తేజస్సును నాలో నింపింది. అమరత్వానికి దగ్గర బాట నేర్పరిచింది.

నే నిక్కడ వుండకూడదు. ఈ పవిత్ర ప్రేమ స్మృతి పవిత్రంగానే వుండనీ ! కనీసం నా కా ఆత్మ సంతృప్తైనా మిగులుతుంది. సాధ్యమైనంత త్వరతో ఈ భయంకరమైన ప్రదేశాన్నుండి పారిపోవాలి. కల్యాణికి జడిసికాదు. నా అంతరాత్మకి దడిసి. నేను జ్ఞాన దారిద్ర్యంతో కల్యాణిని పోగొట్టుకోలేదు. నాకు ఈ సంతృప్తి చాలు. నా కు ఇప్పుడు ఖేదము లేదు. ఆనందము లేదు. కాని ఏదో గండం గడిచినట్లు అనుభూతి.

సామాన్లు సర్దేశాను. ఇలా అర్ధాంతరంగా చదు వాగిపోతున్న దంటే విచారంగావుంది. కాని అందుకు వగచి ప్రయోజనం లేదు. ఇక్కడ, ఈ ఒంటరి జీవితంలో కళ్ళు మూసినా తెరిచినా శూన్యమే కనపడుతోంది ! ఈ శిక్ష నాకు వద్దు. ఈ పరాజయా న్నెలా తట్టుకోగలిగానో నాకే తెలియదు. నేను శాంతిని కోల్పోయాను. ఏదో ఆవేదన. ఈ ఆవేదనకోసరమేనా ఇక్కడికి వచ్చాను !

కొందరు జన్మిస్తూనే గొప్పవా రవుతారు. కొందరు ప్రతిభవలన గొప్పతనాన్ని సంపాదించుకుంటారు. నాలా కొందరు దుఃఖించటానికే పుడతారు.

జీవితానికి లక్ష్యం శాంతిగా జీవించటమే ! కాని ఆ శాంతే దూరమైతే నాకు జీవిత మెందుకు ?

కూర్చుని సంధ్యారాగాన్ని చూస్తూ కలలు కనటంమాత్రం చేతనౌను నాకు. కాని నా కలల్ని ఈ అస్పష్ట నవజాగృత చైతన్యం పూర్తిగా పునాదులతో సహా కదిలించివేసింది. నేనిన్నాళ్ళూ ఏకాకిగానే జీవిస్తూవచ్చాను. ఈ ఏకాకిత్వంలోని ఆనందము నే నెవరితోనూ చెప్పుకోలేనిది. కాలం, మళ్ళీ నన్ను ఒంటరి జీవితపు పొలిమేరలలో అడుగుపెట్టమని శపించింది. శాసించింది. నా జీవితం నన్ను వంచించింది.

రేపే నేను వెళ్ళిపోవటం. ఈ మాటలు తలుచుకున్నప్పుడల్లా పిచ్చి వూహలు కలుగుతున్నాయి. మళ్ళీ కల్యాణిని ఒకసారి చూస్తే...

"కృష్ణా !"

ఎవరు? ఎవ రీ పిలిచింది! ఎవ రీదేవత? నన్ను కరుణించిందా? గవాక్షంగుండా బయటకు చూస్తున్నవాడిని వెనక్కి తిరిగి చూశాను.ద్వారా న్నానుకుని కల్యాణి నిల్చొని వుంది. ఇది కలా ? యదార్థమా ? యదార్థ మెందు కౌతుంది ? ఇది కలే ! ఒట్టి కల. సత్యం కాని కల. కళ్ళు తెరుచుకునే కలలు కంటున్నాను. గాలికెరటాలలో తేలిపోతూ నిల్చుంది కల్యాణి !

"కృ...ష్ణా !" అంది దగ్గరగా వచ్చి.

"క...ల్యా...ణి" అన్నాను. నాకు తెలీకుండానే నా గొంతు రుద్ధమైంది.

ఒక స్పర్శ ! ఆ స్పర్శానుభూతి అద్భుతమైనది. చేతనా చేతన ప్రపంచంలోని ప్రతి అణువూ స్థంభించి పోయింది. గదిలోని ప్రతి వస్తువూ గిరగిర తిరుగుతున్నది. నా కళ్ళు బైర్లు క్రమ్మినయి. నాకు ఎవరూ కనిపించటం లేదు.ఎవరూ నా హృదయాన్ని, నా జీవితాన్ని స్పర్శిస్తున్నది ? నా రక్తం ఉరకలు వేస్తూ పరుగెత్తింది. నా శరీర మంతా స్వేదంతో తడిసిపోయింది. భరించలేని నీరసంతో కుప్ప కూలిపోయాను. ప్రేమయొక్క మరో భాగమా ఇది ? ఎవరో పిలుస్తున్నారు. ఏమిటిది, మరణమా ?

ఈ అనుభూతి క్రొత్తగా వుంది. ఇదే జీవితాన్ని నూతనం చేసింది. వసంతాన్ని కుమ్మరించింది.

"కృ — ష్ణా !"

దీపం వెలిగింది. గదినిండా ప్రేమలాంటి వెలుగు అలుముకుంది.

పాదాల మీద వేడినీటి బొట్లు పడినయి. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను.

అప్రయత్నంగా నా నోటినుండి "క..ల్యా..ణి" అన్న మాట వెలువడింది.

"కృ...ష్ణా !"

ఈ పిలుపు నా గుండెను దూసుకు పోయింది. నా గుండె ఒక్కసారి బరువెక్కి పోయింది. నాలోని జడత్వం చైతన్యంలో కరిగిపోయింది.

"కల్యాణీ !" అన్నాను గాద్గదికంగా.

"నన్ను క్షమించు కృష్ణా !" అంది దీనంగా.

"క్షమా ?"

"నేను చాల పెద్దతప్పు చేశాను. కాని తప్పని వెంటనే తెలుసుకోగలిగాను."

"కల్యాణీ !"




"నువ్వెక్కడికి పోతావో నేనూ అక్కడికే! నేను రావటం ఇష్టం లేకపోతే కనీసం నన్ను నీ ఛాయగానైనా చేసికో."

"ఏమంటున్నావు నన్ను కల్యాణీ? నన్ను తిరస్కరించావు ఒకనాడు గుర్తుందా ?"

కల్యాణి బాధగా నవ్వింది.

"అందుకు ప్రతీకారం చేస్తున్నావా ?"

"ప్రతీకారమా?" అన్నాను ఆశ్చర్యంతో.

"నా కిక్కడ చోటు ప్రసాదించవూ ?"

ఏమిటిది, అపజయం ప్రసాదించిన ఫలితమా ?

''లేదు కల్యాణీ, నువ్వు ఆలోచించు. ఇదివరకు నేను ఆవేశంలో చేసిన పనేమో అది! జీవితం పరిమిత మైంది కల్యాణీ—''

"కృష్ణా, నా మనస్సు విప్పేస్తున్నాను. నిజంగా ఒక నెలరోజులనుండి నా మనస్సుతో వెంబడిస్తున్నానునిన్ను. నీమీద వున్న ఆ భావ మేమిటో అప్పట్లో తెలుసుకోలేకపోయాను. నిన్ను తిరస్కరించాక ఏదో బాధ కలిగింది. ఆత్మీయు నెవర్నో పోగొట్టుకుంటున్న బాధ కలిగింది."

''కల్యాణీ!'' అన్నాను నిర్ఘాంతపోయి.

''దా న్నేమనాలి? ప్రేమ అనాలా ? నేను చెప్పలేను. సడి లేని నడిరేయి నిశ్శబ్ద తరంగాలపై తేలివచ్చే స్వప్నాలలో అన్వేషించాను. ప్రతి అన్వేషణలోనూ నువ్వే! ప్రతి కదలికలోనూ నువ్వే. జీవితంలోని

కల్యాణి చేతులు నా పాదాలమీద పారాడి నయి. ఒక ఆనంద వీచిక, ఒక విషాద వీచిక హృదయాకాశంలో పారాడింది.

"నువ్వే నన్ను క్షమించాలి. నేను వెళ్ళి పోతున్నాను. కాని వెళ్ళబోయేముందు ఈ ఒక్కమాట మాత్రం చెప్పి వెళ్ళిపోదా మనుంది. నీ మీద నా కేం కోపం లేదు. ద్వేషం లేదు. నిన్ను ప్రేమించగలను గాని ద్వేషించలేను ? నిన్ను ఆశీర్వదిస్తున్నాను, నా కా అర్హత వుంటే. నువ్వైనా సుఖించు" అన్నాను. నా మాటల్లో దుఃఖం దొంగ తనంగా చేరింది.

"వెళ్ళిపోతున్నావా ? ఎక్కడికి ?"

నిట్టూర్చాను.

"ఏమో! బహుళ నాకే తెలియదు.''

''అయితే పద. నేనూ వస్తాను.''

ఈ మాటతో చలించిపోయాను. నా మనో ఫలకంమీద మాటల ఉలిదెబ్బలలో శిల్పాన్ని చెక్కుతున్నది ఈ స్త్రీ.

"వస్తావా ? ఎక్కడికి ?"

ప్రతికోణంలోనూ నువ్వే దర్శనమిచ్చావు. భూత భవిష్య ద్వర్తమానాలలో ఏ కోణం లోంచిచూసినా నువ్వు నీతోపాటుచరించే ఆకారాలు...నా హృదయంలో నివేదనకు రూప కల్పన జరిగింది. ఇప్పుడు తెలిసింది_''

''కల్యాణీ!" అన్నాను ఏమనాలో తెలీక.

"నన్నింకా క్షమించలేవా?''అంది వెక్కి వెక్కి ఏడుస్తూ. ఎంత అమాయకత్వం ?

"క్షమలేనిచోట ప్రేమ ఉండి నిష్ఫలమే అవుతుంది. నిన్ను ప్రేమించలేకపోతే నాకు ఆత్మే లేదన్నమాట" అన్నాను కల్యాణిని దగ్గరికి లాక్కుని.

కల్యాణి చేతులు నా గుండెలు నిమిరినయి. ఇదే ధైర్యం! ఆ ఎర్రటి చిన్న అధరాలు నావి. ఆ చేతులు నావి. ఇక నేను సాధించలేనిదేమిటి? కోల్పోయిన వస్తువును పొందాను తిరిగి. ఈ కల్యాణి నా జీవిత మహాశిల్పాన్ని అద్భుతంగా చెక్కగలదు. ఇక నా జీవితం నిత్యకల్యాణం పచ్చ తోరణమే!

"జ్వాలయే దీపమునకు సర్వస్వ మట్లు
ప్రణయమే జీవితంపు సర్వస్వ మయ్యె."

ఈ ప్రేమతోనే నేను నా జీవితానికి సంపూర్ణత్వాన్ని సంపాదించుకోగలను. ఇదే ఆశ!

## 2

ఒకతరం గడిచిపోయింది. ఈ మూడు నెలల జీవితాన్ని ఏమని వర్ణించేది? స్వర్గమనేది ఎక్కడోవుందని అనుకునేవాడ్ని. మనస్సే స్వర్గనరకాలు సృష్టిస్తుంది.

ఆశలు నిరాశలు దుఃఖం వీటన్నిటి మలుపుల్లో తిరిగిన జీవనస్రవంతి ఒకానొక ఆనందపు మైదానం మీదనుండి ప్రవహించ సాగింది నిర్మలంగా. కల్యాణి ముఖంలోకి కళ్ళలో కళ్లుపెట్టుకుని చూస్తూ...పారిజాత వృక్షం క్రింద కల్యాణి ఒడిలో పడుకుని ముఖంలోని భావాలు చదువుతూ _

ఇలా గడిచింది. నా జీవితం, ఒక్క మాటలో చెప్పాలంటే పారిజాత పుష్పమే అయింది.

ఆరోజు నా కింకా జ్ఞాపకముంది. ఆదివార మనుకుంటాను.

"నెక్స్ట్ ప్రోగ్రాం ఏమిటి ?" అన్నాను కల్యాణివంక చూస్తూ.

"నే నింక నడవలేను బాబూ" అంది చిలిపిగా చూస్తూ. గతంలోని విషాదగాధలన్నీ ఈ ఒక్క చిరునవ్వుతో కరిగిపోయినయి. ఇన్నాళ్లూ ఆనంద మనేది ఈ మహావిషాద కావ్యంలోని ఉపఖ్యానమే ననుకునే వాడ్ని. కాదు. ఆనందం కానీ, దుఃఖం కాని ఒకేదాని యొక్క ఊటలు.

జీవితంలో అవకాశాలు రావు. మనమే అవకాశాలు కల్పించుకోవాలి!

"అయితే మ రేం చేదాం ?"

"అక్కడికి వెళ్ళి కూర్చుందాం" అంది.

మసకచీకటి వ్యాపిస్తున్నది. చీకటి వెలుగుల్లో తడిసీ తడియని చీరల అడుగున కొండలు తమ అనంత నగ్నసౌందర్యాన్ని దాచుకోవాలని ప్రయత్నిస్తున్నయి. భాస్కరుడస్తమించాడనే దిగులుతో పద్మకన్య ముడుచుకుని పోయింది.

"పదండి!" అంటూ కల్యాణి నన్ననుసరించింది.

ఇది కల్పనకాదు. వాస్తవం. కల్యాణి నా జీవితంలోని శరదృతువు.

"ఒంటరిగా నిల్చుని ఎవరికీ వినపడని పాట పాడుకుంటాను! రాగబద్ధంకాని పాట అది. నా చుట్టూ తమస్సు పేరుకుపోతుంది. అప్పుడు గాడాంధకారాన్ని చీల్చుకుంటే పరుగెత్తే తటిల్లతలా నీవు జ్ఞాపకాని కొస్తావు. ఒక్క క్షణం నా మనస్సు దిద్భ్రాంతిచెంది బరువెక్కుతుంది. నాకు తెలీకుండానే నా కళ్లు నీళ్ళతో నిండుతయి. నన్ను ఏకాకిని చేసి నువ్వెళ్ళిపోయావనే బాధతో నేను మరణిస్తాను..."

ఇవి నేను కల్యాణి తిరస్కరించిన రోజున నా డైరీలో వ్రాసుకున్న వాక్యాలు. ఈ క్షణంలో వీటి కేమైనా విలువ వుందా ?

"ఏమిటి ఆలోచిస్తున్నారు ?"

"ఏమీలేదు."

"కాదు. చెప్పాలి!"

"ఏ మాలోచిస్తున్నా నంటావు ?"

"ఏమో. మీకు తెలియాలి ?"

"నిన్ను గురించే!"

కల్యాణి ముఖం సిగ్గుతో బరువెక్కి వాలిపోయింది. దూరంగా కాలేజి హాస్టలు అస్పష్టంగా కనిపిస్తోంది. ఆకాశంలో అందమైన శుక్రతార ఒంటిగా వెలుగులు విరజిమ్ముతూ ఉదయించింది.

చిరుగాలికి కల్యాణి ముఖం మీద ముంగురులు నాట్యం చేస్తున్నయి. తెల్లటి చీర అంచు వంకులు తిరిగి వయ్యారంగా పాదాలమీద పడి మెరుస్తోంది అందంగా.

"హల్లో, కంగ్రాచ్యులేషన్స్ కృష్ణా!'' అంటూ మూగారు మిత్రబృందం. మమ్మల్నెక్కడ చూశారు ?

"ప్రేమపరీక్షలో విజయము నొందిన స్నేహితుడా! ఇదే అభినందనలు" అన్నాడు శాస్త్రి.

"థాంక్స్"

"ఒట్టి 'థాంక్స్' స్వీకరించకూడదని ఒట్టు వేసికున్నాను."

నాకు వీళ్ళ సంగతి తెలుసు. నన్ను వదలరు.

"ఒరేయ్ ముందే చెబుతున్నాం. నీకా ఏకాంతం కావాలి. అఫ్‌కోర్సు, ఈ కాంత పక్కనుండా లనుకో. పార్టీ ఇచ్చావా తక్షణం నిష్క్రమిస్తాం. లేదా..."

"ఇప్పుడు మళ్ళీ ఊళ్ళోకి పోవద్దురా."

"నీకా శ్రమ ఇస్తామా! ఎంతయినా ప్రేమలోపడ్డవాడివి. ప్రేమికుడూ, గుడ్డివాడూ సమాన మన్నారు. నేనే శ్రమపడతాలే. ఏదీ, ఒక పదిరూపాయల నోటందుకో_" అంటూ వాడే అందుకున్నాడు నా జేబులోంచి.

"సరే" అన్నాను చేసేదేం లేక.

శాస్త్రి డబ్బు తీసుకొని రివ్వున సైకిలు మీద వెళ్ళి అయిదు నిముషాల్లో పలహారపు పొట్లాలతోను. వాటర్ బాటిల్స్‌తోను, మూడు ఫ్లాస్కులనిండా కాఫీతోను తిరిగి వచ్చాడు.

"ఇంత శ్రమపడిన వాడిని నాకు ఎక్కువ భాగం సుమా" అన్నాడు శాస్త్రి.

"అలాగే!"

"ఉండండి. నేను డిస్ట్రిబ్యూట్ చేస్తాను."

"ఆ శ్రమకూడా పడతానంటావా? అభ్యంతర మేముంది! కాని దీనికి మాత్రం ఎక్కువ భాగం రాదు."

"మీ రంతవాళ్లే. నాకు తెలుసు" అంటూ అందరికీ పంచిపెట్టాడు.

"గుడ్, అంతా అయిపోయిందా. ఇంకా ఓ చిన్న పనుంది" అన్నాడు రాగయుక్తంగా.

"ఏమిటి?" అన్నాను.

"నన్నుగురించి ఇంతే నన్నమాట తెలుసుకుంది. అంత స్వార్థపరుడ్ని కాను. మీకూ తెచ్చాను" అంటూ సైకిలు వెనక బుట్టలోంచి రెండు పూలదండలు తెచ్చాడు.

"ఎందుకు?" అంది వసంత.

"ఆఁ! ఏంలేదు. ఇవ్వాళ బాగుంది. పెళ్ళి చేద్దా మని —" అన్నాడు శాస్త్రి.

"పురోహితుడికి కట్నా లుండవు."

"ఆఁ! ఇక కానీండి! వెయ్యరా చూస్తావేం."

"ఇంతమంది స్నేహితుల సహకారం ఉందంటే నేను ధన్యుడ్ని" అన్నాను నవ్వుతూ.

"ఏమిటిది బాబు" అంది కల్యాణి సిగ్గుతో. ఒక తీయని ఆశ ఆమె కళ్ళల్లో ప్రకాశవంతమైంది. మేం మానసికంగా చేసుకున్న వివాహానికి వీళ్ళు సాక్షులు.

"ధృవంతే రాజా వరుణో ధృవం దేవో అగ్నిశ్చ..." అంటూ ఎత్తుకున్నాడు శాస్త్రి చేయెత్తి ఆశీర్వదిస్తూ. అందరూ గొల్లున నవ్వారు.

కల్యాణి ఓరగా నావంక చూస్తూ నా మెడలో పూలమాల వేసింది. కాని ఈ స్వల్ప క్రియే వివాహమైతే ఇంకేం? ఇది వివాహంలోని వేడుక మాత్రమే కాని వివాహం కాదు, కాలేదు. మనస్సులు సాక్షులు కావచ్చు కాని ఆ మనస్సులు లేనివారికి దండలు వేసుకోవటంలో ఎలాంటి విశిష్టతా గోచరించదు.



"నాయకుల అభిప్రాయాలు కలవ వేం నాన్నా?"
"కలవవు కనకనే వాళ్లు నాయకులయారు!"

అదే నాపాలిట జీవన్మరణ సమస్య అయింది.

ప్రేమించటానికి ధనం కావాలనే విషయం నా కిప్పటిదాకా తెలీదు. నేను బీదవాడి నైనంతమాత్రాన ప్రేమించే హక్కు లేదనటం, నాకు హృదయమే లేదని వాళ్ళు తేల్చడం జరిగింది. మా జీవన పాత్రలలో కలబోసుకున్న ఆనందం ఆ పాత్రల విచ్ఛిన్నంచేత వొలికి పోయింది. మాయ యొక్క ప్రభావమే ఇది. ఏది లేదో అది మాయ. అగ్నినుండి వేడిలా అది జీవితం నుండి విడదీయలేనిది. అదే వారిని కప్పేసింది. కల్యాణి నానుండి దూరమై పోయింది. చివరి రోజు నా దోసిట్లో కల్యాణి కార్చిన కన్నీరు ఇంకా అలాగే వుండి. ఎన్నిజన్మలు గడిచినా ఆ కన్నీరు అలాగే వుంటుంది.

ఈ హృదయపు కోతను నేను భరించలేను. ఈ భగ్నత్వపు పొలిమేరలలో అడుగు పెట్టిన నేను జీవితపు టౌన్నత్యాన్నే కోల్పోయాను. నా కిక ఏ ఆశాలేదు, ఇక కల్యాణి నాకు దక్కదు. తెగిపోయిన వీణా తంత్రులమీద శ్రుతి చేయటమే నా బ్రతుకు.

ఇది జీవితపు చివరి సోపానం. ఏ దీపం సహాయంతో నా జీవిత గ్రంథాన్ని పూర్తి చేద్దా మనుకున్నానో ఆ దీపం నానుండి శాశ్వతంగా దూర మైపోయింది. ఆ జ్యోతివెలుగు నామీద పడదు. నేను చరిత్ర హీనుడ్ని. నాకు తెలుసు నే నింకా ఎంతో కాలం బ్రతకను. కల్యాణితోపాటు నేను నా సర్వస్వాన్నీ పోగొట్టుకున్నాను. 'కర్మేణా వాధికారస్తే–' అని సంతృప్తి పడమంటుంది గీత. అది నాకు చేతకాదు.

నా జీవితంలో అవాస్తవికత ప్రారంభమైంది. కల్యాణి ప్రక్కనిల్చుని దూరంగా కొబ్బరిచెట్లు త్రాగే వెన్నెల తేనెని చూస్తూ కల్యాణి ముఖంలో భవిష్తత్తులోని తీయని దాంపత్యాన్నిగూర్చి తలుచుకుంటూ ఇన్నాళ్ళు గడిపాను. ఆశపడ్డాను. కలలు కన్నాను. జీవితంలో ఒక క్రొత్త అనుభూతి, కోసరం, క్రొత్త ఆనందం కోసరం, ఒక క్రొత్త శిల్పంకోసరం, ఒక క్రొత్త సౌందర్యం కోసరం, నాట్య విన్యాసం కోసరం అన్వేషించాను. నా ప్రతి అన్వేషణలలోనూ కల్యాణే ప్రతక్షమైంది.

ప్రేమకు ప్రతిఫలం మరణమా? అలాగే వుంది. మరణం యొక్క కల నా జీవితం. నాకు తెలుసు. నా హృదయం దూరంగా వినిపించే మృత్యుదూత చిరుపదాల సవ్వడి కోసరం ఎదురు చూస్తోంది. చీమ చిటుక్కుమన్నంత శబ్దం కలిగినా ఆ వచ్చింది మృత్యుదేవ తేమో నని, నా జీవితాన్ని కప్పులోపోసి ఆతిధ్య మిద్దా మని నా ఆశ. తలచుకుంటే ఆశ. తలచుకోకుండా వుండలేను. ఈ మిగిలిన అనుభవాల జ్ఞాపకాలతో

నేను జీవితాంతం గడుపలేను. నా స్నేహితులు అనేవాళ్ళు, నా స్నేహితు లనేమిటి అమ్మావాళ్ళే అనేవాళ్ళు. "జీవితానికి పరిణామం దుఃఖమే అయితే దానికి విలువే లేదన్న మాట. పగిలిన బొమ్మకోసరం దుఃఖించడం అవివేకం. గతంలోని కన్నీటిని తలుచుకుంటే వచ్చేది కన్నీరే కాని ఆనంద బాష్పాలు కావు. నీ మనస్సు దిటవు పరుచుకో." నాకు జవాబు దొరికేది కాదు. దొరికినా చెప్పా లనిపించలేదు. ఆ స్థితిలో లేను. గతాన్నంత త్వరలో మరిచిపోగలమా?

వా ళ్ళెవరూ నా అంతరాత్మని దర్శించలేదు. ఆ శక్తి వీళ్ళకి లేదు. వీళ్ళు నా బాహ్య జీవితాన్ని మాత్రమే దర్శించారు. నాది క్షంతవ్యం కాని విషాద వృత్తాంతమనే సంగతి ఎవరికి తెలుసు! నన్ను నేనే అర్థం చేసుకోలేక పోతున్నాను. పిచ్చివాని ప్రేలాపన లాంటిదే నా జీవితం. చిన్నపిల్లలు పలకమీద గీసే గీత లాంటిది నా జీవితం.

జీవితం తీయగా వుందంటే దాన్ని మనం అంత తీయగా ఊహించుకోవడమే కావచ్చు. కాని నేనా శక్తినికూడా కోల్పోయాను. జీవితం ఊహ కందనిది.

నా మానసికస్థితి ఎలా వుందో దేహస్థితి కూడ అలాగే వుంది. ఈ అంతర్వేదన బాట గుండా పయనించి మృత్యుద్వారాన్ని సమీపించాను. వెన్నెల బిందువులాంటి జీవితంలో అమవస నిశి నింపుకున్నాను.

Unborn tomorrow and dead yesterday
Why fret about them if today be sweet

ఇవి నాలాంటి వారికి వర్తించవు. 'రేపు' కోసరం ఎందుకు ప్రాకులాడుతావు? ఈ రోజు ఇంత తీయగా వుంది – ఈ రోజు నిజంగా తీయగాలేదు. దాని యొక్క నిజస్వరూపాన్ని కూడ నేను చెప్పలేను. నేను చావుబ్రతుకుల సరిహద్దులో నడుస్తున్నాను. నే నెప్పుడు చేయి జాచినా శూన్యమే నా చేతి కందుతోంది. అందుచేత నేను ఆ 'రేపు'ని గురించి ఆలోచించలేని స్థితిలో వున్నాను. 'నేడు నిన్నట్లు రేపు నేడట్లు, అందని ఫలంబు చేజాప అందు నెట్లు?' నాకు మిగిలింది ఒకే కోరిక. ఈ రెండు నెలల్లో కల్యాణి నా హృదయ ఫలకంమీద మరింత గట్టిగా ముద్రించు కుంది. ఆ కల్యాణిని చూడాలి! ఒక్కసారి, నా జీవితం ముగిసిపోయే లోపుగా ఒకే ఒక సారి – ఎలాచూస్తాను. పచ్చగా వెలిగిపోయే నవవధువులాగానా? కాని ఆమెప్రక్క ఎవరు? నేను కాదు. నాకా అదృష్టంలేదు. ఎవరో వుంటారు. వణుకు చేతులతో రాలిపోతున్న కన్నీటి చుక్కలతో కల్యాణిని ఆశీర్వదిస్తాను! ఈ ఆశైనా నెరవేరుతుందా?

"What is love? It is not here after
Present mirth has present laughter
What is to come is still unsure
In delay lies no plenty
Then come, kiss me, sweet and twenty
Youth's a stuff will not endure."

కాని ఈ కోరికతో జీవించటమంటే మాటలా? నా ప్రణయజీవిత మంతా ఒక చెదిరిపోయిన కల. న్యాయాన్యాయాలను ఎవరు విచారణ చేస్తారు? నాకు కలిగిన అన్యాయానికి ఎవర్ని శిక్షిస్తారు? దేవుడిచ్చిన కఠినమైన తీర్పు ఇదా? తన సర్వస్వాన్ని కల్యాణి త్యాగం చేసేందుకు సిద్ధమైంది.అదే కల్యాణి తప్పు. ఆనాడే తిరస్కరించి వుంటే బాగుండి పోయేది.

నేను సానుభూతి కోసరం ఇదంతా వ్రాయటంలేదు. నా జీవితం భయంకరమైన శూన్యమే అయింది. ఈ దారుణమైన విషాద వృత్తాంతాని కంతంలేదు. ఎవరిమీదనైతే నే నాశలు పెట్టుకున్నానో ఆమె తన కేంద్రంలోనే అదృశ్య మైపోయింది. నా కళ్ళల్లోని చివరి నీటిబిందువుకూడ కల్యాణిని తలుచుకుని రాలిపోయింది. నా కళ్ళల్లో తడి ఆరిపోయింది.

కల్యాణి నన్ను తన మౌనంతో దహిస్తున్నది. ఈ పెద్దల నిర్ణయాలకి అస్థిరత్వం ఉండదు. హద్దులు వుండవు. ఇప్పుడని పిస్తుంది వాళ్ళు ధనాన్ని ప్రేమించినంతగా పిల్లల్ని ప్రేమించ రేమోనని.

"కల్యాణీ, నువ్వు కల్యాణివిగా నే జీవించు. ఇది నా అంతిమ కోరిక. రాలిపోయేలోగా నిన్ను చూడాల నుంది. కాని అక్కడికి వచ్చి ఈ కళంక శోభని నీ జీవితంపై వేయలేను. ఏది ఏమైనా ఒకటి మాత్రం నిజం. నేను వస్తే నీ జీవిత సాగరంలో భయంకరమైన తుఫాను చెలరేగుతుంది. ఆ గాయం తిరిగి రేగుతుంది. నేను నిన్ను శారీరకంగా ఏనాడూ కోరలేదు. నా హృదయంలో దాచుకుని ఆరాధించాను, ఆరాధిస్తాను. చివరి వూపిరి వదిలే వరకూ ఆరాధిస్తాను. ఆరాధింప బడటంలోకన్న ఆరాధించటం గొప్ప విశేషం. ఈనాడు నాకు మిగిలింది, నువ్వు మిగిల్చింది ఒకటే సంతృప్తి. మనం దేవునికి నివేదన చేస్తాం. కాని ఆయన దాన్ని స్వీకరించాడో లేదో మనకి తెలియదు. ఆయన స్వీకరించా డనే మనకి సంతృప్తి. ఆ తృప్తే నాకు మిగిలింది. ఈ కన్నీళ్ళు ఎవరిని మారుస్తాయి? వాటి విలువ ఎంత? నాకు శాంతిలేదు. ఈ కన్నీరు నా గుండెలోని మంటని ఆర్పలేదు. నా ఆరోగ్యాన్ని గురించి అందరూ ఆదుర్దా పడుతున్నారు. డాక్టర్ల మీద డాక్టర్లుమారారు. నాకు తెలుసు పర్యవసాన మేమౌతుందో? ఆశలు తీరిన జీవిత మేమౌతుంది? రైలు పెట్టెలాంటిది నా జీవితం. కేరమ్‌బోర్డులో కాయిన్ లాంటిది నా జీవితం. వాటికి స్వయంగా కదిలేశక్తి లేదు. నేను ఈ క్షుద్ర జీవితం జీవించలేను. సాధ్యమైనంత త్వరలో ఎవరూ నా కంటబాని లోకాలకి పారిపోవాలి.

ఒక నాడు నువ్వేమన్నావో గుర్తుందా?

'By plucking her petals you do not gather the beauty of the Flower.'

నా ఆశా కుసుమంయొక్క రేకు లన్నీ నేనే త్రుంచివేసుకున్నాను. ఇప్పుడు నేను నాలో జీవించటంలేదు. నా జీవిత నాటకంలో నేను ప్రేక్షకుడ్ని. మానవుడు బాహ్య ప్రపంచం

వలన వ్య క్తిత్వం సంపాదించు కుంటాడు. నా వ్య క్తిత్వం బీటలు వారిపోయింది.

డాక్టరు రామారావు వచ్చేదాకా ఈ మహా సమస్యకి పరిష్కారం దొరుకుతుందని నేననుకోలేదు. రామారావు వచ్చాడు.

## 3

"కృష్ణని మా నర్సింగ్ హోంలో చేర్పిస్తే బాగుంటుం దని నా అభిప్రాయం" అన్నాడు నన్ను ఎగ్జామిన్ చేసి.

"ఊరు కాని ఊరు. అవస్థలు పడుతూ ఎందుకు ?" అన్నాడు బాబాయి.

"నో, నో. మీ రలా అనుకోవద్దు. కృష్ణ మానసికంగా బాధ పడుతున్నాడు. అంతే. స్థలం మారిస్తే కొంతైనా ఉపయోగకరంగా వుంటుంది. నాతో పంపండి. నా ప్రాణ స్నేహితుడు వాడు. వాడి ప్రాణానికి నా ప్రాణం అడ్డు. ఏం పిన్నీ ?"

అమ్మ మౌనంగా వుంది.

"అయిదు నెలల క్రిందటే ఫారెన్ నుంచి తిరిగి వచ్చాను. మొన్ననే వీడిసంగతి తెలిసింది. వెంటనే వచ్చాను. మా నర్సింగ్ హోంలో వీడు తప్పక ఆరోగ్యాన్ని సంపాదించుకుంటాడు."

నాకు కొన్నాళ్ళు ఇక్కడ్నించి పారిపోదా మనిపించింది. ఈ నాలుగు గోడల మధ్య జీర్ణించి పోయిన గతమే కనుల ముందు మెదులుతోంది.

నర్సింగ్ హోంని చూశాక అది స్వర్గమేమో నన్న అనుమానం కలిగింది. చుట్టూ రకరకాల మొక్కలూ, గులాబులూ పవిత్రతకీ. స్వేచ్ఛకీ చిహ్నాలై విరయబూసేవి !

దూరంగా మబ్బుల కిరీటాలు పెట్టుకుని రాజుల్లా సభలు తీర్చేవి కొండలు.

వీటిని చూస్తుంటే నాకు ఎంత ఆనందం కలిగేదో అంతదుఃఖమూ కలిగేది. మబ్బులు పట్టిన సాయంత్రం, దూరంగా ఒంటరిగా గమ్యం తెలియకుండా ఎగురుతూపోయే పక్షిని చూస్తున్నప్పుడల్లా నా గుండెల్లో ఎవరో చేతులుపెట్టి కెలికిన ట్లయ్యేది. ఈ




"ఏమోయ్, నువ్వు ఇంటికి ఎప్పుడూ ఉత్తరాలు రాసినట్లు లేదు ?"
"ఎందుకండి ? ఇంటి దగ్గర ఎవరున్నారూ ! మా వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు గదండీ."

అద్భుత ప్రకృతి సుందరి కల్యాణియై దర్శన మిచ్చేది. అప్పుడు 'నా గుండె గాయము కుట్ట సూది, కంట అశ్రు జల ధారయై అవతరించేది. మరి కాసేపటికి హృదయదీపము మలిగి పోయినది గాన పొగ వినీలాంబరము కట్టి పొగల జొచ్చేది!'

'జ్వాలయే దీపమునకు సర్వస్వమట్లు
ప్రణయమే జీవిత సర్వస్వ మయ్యె !'

ఈ జీవితం నాకు సరిపడదు. నా జీవితం దేవుని ప్రయోగశాల అయింది.

దీపం కొడిగట్టుకు పోతున్నది. ఇక ఎంతో సేపు పట్టదు అది ఆరిపోవటానికి.

నా కేసు రామారావుకి అర్థం కాలేదని అతని ముఖం చూస్తేనే తెలుస్తుంది. రొటీన్ గా నావద్దకు వచ్చి కూర్చుని ఎగ్జామిన్ చేసి వెళ్ళిపోయేటప్పుడు అతనిముఖం చూస్తే నాకు నవ్వొచ్చేది ! అతడు పరాజితుడు కావాలి. అదే నా కోరిక.

ఈ పదిరోజుల్లోను ఇదొకటి మాత్రం అలవాటయింది. సాయంకాలం వచ్చిందంటే అద్దాలకిటికీ తలుపులు తెరిచి చెక్కిలికి చేయి చేర్చి దూరంగా చేతులు చాచి మబ్బు కన్నెలను పట్టుకునే కొండలవంక చూస్తూ, కొండల చేతులనుండి తప్పించుకొని పరుగెత్తుకొచ్చే సెలయేటిని చూస్తూ, నిశ్శబ్దాన్ని భగ్నంచేస్తూ కలకలా రావాలతో వృక్షాగ్రాల మీద వ్రాలే శకుంత సముదాయాన్ని చూస్తూ కాలం గడిపేవాడ్ని.

'గుండెలో గ్రుచ్చుకుని బయటకు వెడల కున్నా సరే నీ బాణపు వాడిముక్కే నా కిష్టము.'

"నువ్విలా బాధపడితే ప్రయోజనంలేదు కృష్ణా ! నువ్వు మనస్సు దిటవు పరుచుకోవాలి" అనేవాడు రామారావు.

పాపం వెర్రివాడు. 'నా బ్రతుకు రథమై పరుగెత్తుతున్నది, ఆ గుర్రపు పగ్గాలు నా దగ్గరలేవు.'

నా లక్ష్య మదే ! ఈ బాధతో కరిగి కరిగి గాఢసుషుమ్నలో లీన మైపోవాలి.

## 4

భగ్న ప్రేమికుడి మనస్సులా చిమ్మ చీకటి అలుముకుంటున్నది. దూరంగా

కౌగిలిని ఆలింగనం చేసుకుంటున్నది చీకటి సుందరి.

గదిలో లైటు వేయలేదు. నర్సువచ్చి లైటువేస్తే భరించలేక ఆర్పేయమన్నాను.

డాక్టరింకా రాలేదు. వచ్చి ఆయనేం చేస్తాడు? ఊళ్ళో ఏదో సీరియస్ కేసుంటే వెళ్ళాడట. చీకటిలో కలసిపోయి నిలబడ్డాను శిలవలె.

ఒక స్పర్శ. పూర్వపు స్పర్శలాంటి స్పర్శ. భాష్పకణం వేడిగా వుంది. నా పాదాలపై అగ్నివర్షం కురిసింది.

చప్పున పాదాలు లాక్కున్నాను. కాని నా పాదాలపై ఎవరో పడిన ట్లనిపించింది.

"ఎవరు?" అన్నాను బలహీనంగా.

వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం జవాబిచ్చింది.

"ఎ...వ...రు?"

ఆ స్పర్శానుభూతి ఇంకా మత్తులా పోలేదు. తలదించి ఆమెను చూసే ధైర్యం లేదు. నేనెవరికి అన్యాయం చేశాను? ఈమె పొరబడింది.

"కృ...ష్ణా?"

నా ఆత్మ జాగృతమైంది ఈ మాటలతో. భ్రాన్తపడిపోయాను. అనుకోని సంఘటన ఇది. క...ల్యా...ణి! ఇక్కడికెలా వచ్చింది?

ఇది కల! పీడకల!

"కృ...ష్ణా!"

తిరిగి కలలోకి పోయింది మనస్సు.

"ఇలా తయారైందా నీ జీవితం?" అంది ఏడుస్తూ.

నిట్టూర్చి వూరుకున్నాను.

"కృ...ష్ణా!" ఆ పిలుపులో ఎంత విషాదం!

"ఎవరూ తయారు చేయలేదు కల్యాణీ! నా జీవితమే నన్ను వంచించింది. అందని ఫలములకు చేయి చాపటం నా దే తప్పు. నన్ను మర్చిపో."

"నువ్వు నన్ను మరిచిపోలేదు..పోలేవు! కాని ఎంత ప్రయత్నించినా–" కల్యాణి ఆపుకోలేని శోకభారంతో వివశురాలై పోయింది.

"జరిగిందానికి బాధ పడటం దేనికి? 'కర్మణ్యేధికారస్తే' అని సంతృప్తిపడు!"

నా మనస్సు మనస్సులో లేదు. ఈ కల మాత్రం భగవంతు డెందుకు కల్పించాడు.

"కృష్ణా! ఇలాఎన్నాళ్ళు బ్రతుకుతావు?"

"అది చివరికి వచ్చింది. నా జీవిత గ్రంథంలోని చివరి పేజీ ఇది. దీన్ని పూర్తి చేయలేను."

"కృ...ష్ణా!" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

"క...ల్యా...ణీ!" ఎంత పదునైంది కల్యాణి కన్నీరు!

"నాకోసం ఇలా బాధపడి మరణిస్తావా? అది నన్నన్యాయం చేసినట్లు కాదా?"

"కల్యాణీ!"

"ప్రేమయొక్క నిజస్వరూపం అది భగ్నమైననాడు కాని తెలీదు. దానికి పరికల్పం దుఃఖం కాదు. అలా అయితే ప్రేమకి అర్థమే లేదన్నమాట. నువ్వు నన్ను ప్రేమిస్తే నా కోసరం త్యాగం చేయాలి. చేయగలవా?"

"ఆజ్ఞాపిస్తున్నావా?"

"ప్రార్థిస్తున్నాను."

"నన్ను బంధాలలోఇరికించకుకల్యాణీ."

"బంధాలు!" అంది దీర్ఘంగానిశ్వసిస్తూ.

"కల్యాణీ!'' అన్నాను బరువుగా.

"ఇది జీవితమా? చూడు, ఇంతకన్న బాగా బ్రతకాలి."

"జీవిత ముంటే అలాగే."

"అది నీ చేతులో వుంది. జీవితం పరిమితమైందే కావచ్చు – కాని నా కళ్ళముందే దాని అస్తమయాన్ని చూడలేను;"

''కల్యాణి '" అన్నాను ఏడుస్తూ.

రెండు కన్నీటిచుక్కలు నా పాదాలమీద పడి నా గుండె లోతుల్ని వెదికినయి.

"నీ జీవితం ఇలా వృథాపోతే నేను భరించ గలనా? నేను ప్రేమించిన వ్యక్తి నాకు దక్కకపోయినా పరవాలేదు. కాని నువ్వు సుఖపడాలి!"

"సుఖమనేది అందరిదృష్టిలోఒకేవిధంగా వుండదు.''

"లక్ష్యానికి చేరువగా జీవించడమేసుఖం. నా లక్ష్యానికి సమీపంగానే నా జీవితం తిరుగుతోంది."

"దీపం చుట్టూ తిరిగే పురుగులా తిరుగుతోంది లక్ష్యంచుట్టూ నీ జీవితం. ఎంత తిరిగినా ఆ పురుగుకేం లభిస్తుందో నీకూ అంతే లభిస్తుంది.అయినా ఈలోకంలోసుఖదుఃఖాలు ఏవీ శాశ్వతాలు కావు. వాటిలోని మన అనుభవాలు శాశ్వత మనిపిస్తయి, అంతే!" అంది నా పాదాలు పట్టుకుని. ఈ స్పర్శతో కల్యాణి తన ప్రేమ నివేదన చేసింది. కాని ఈ నివేదనని స్వీకరించే ధైర్యం నాలో లేక పోయింది.

"నాకు తృప్తి నివ్వాలంటే నువ్వింకా బాగా బ్రతకాలి. తప్పదు. అది దుర్భరమైనా నా కోసం భరించు."

నేను మౌనంగా వూరుకున్నాను. నా జీవితం నాకే శాపంగా పరిణమించిన ఈ తరుణంలో ఈ తరుణితో ఎలా మాట్లాడాలో నా కర్థం కాలేదు.

"మాట్లాడవేం కృష్ణా! నన్నిలాకూడా బ్రతకనీవా!"

"కల్యాణీ, నే నాత్మవంచన చేసికోలేను. నన్ను క్షమించు. క్షమించు!"

"త్యాగం వంచన కాదు.''

క్షణం నిశ్శబ్దం.

"అంత బలహీనుడివా నువ్వు; ఈనాడే కాదు; ఎప్పుడూ నువ్వు నా క్కావాలి. కాని భౌతికంగా నిన్ను నేను పొందలేను. అయినా 'అసంగంగా' నిన్ను ప్రేమించగలను. నువ్వు అలానే ప్రేమించు."

"గతాన్నంత త్వరగా మరిచి పోగలవా?"

"మరిచిపోవాలి!"

"కల్యాణీ!'' పిచ్చిగా అరిచాను.

కల్యాణి పలకలేదు. పది నిముషాల తరువాత కళ్ళుతెరిచి చుట్టూ చూశాను. చీకటి తప్ప నాకేమీ కనిపించలేదు. ఆ చీకటే

సత్యంలా గోచరించి జగద్వ్యాప్తమై పోయింది.

కల నిజంలా ఎంత భ్రమ కొల్పుతుంది?

5

"హల్లో కృష్ణా, నిన్ను చూస్తే ఆశ్చర్యమేస్తుందోయ్!'' అంటూ ప్రవేశించాడు రామారావు.

"ఎందుకు ?"

''ఎందు కేమిటి ? ఇంత త్వరలో ఎలా కోలుకున్నావు ?"

"ఇది నాకు శేషప్రశ్న."

''నీ విషయంలో ఫెయిల్ అయ్యానను కున్నాను. నువ్విలా ఆరోగ్యవంతుడివి కావడం నాకెంతైనా ఆనందంగా వుంది. అది మా ట్రీట్మెంటు వలన కాదని స్పష్టంగా చెప్పగలను."



"డాక్టర్ ! నాకో ఉపకారం చేసిపెట్ట గలవా !"

"చెప్పు."

"ఏదైనా ఇంజక్షనిచ్చి నా హృదయాన్ని పవిత్రం చేయగలవా ?"

"ఏమిటి !" అన్నాడు ఆశ్చర్యంగా.

"లాభంలేదు. మీరు డాక్టర్లు ! హృదయం బాహ్యస్వరూపాన్ని చూసినంతగా అంత రాన్ని చూడలేరు !"

"నా ఉద్దేశ్యంలో అదే చిక్కు సమస్య !"

"నన్ను పడవ నెక్కింప వచ్చేదివా రెరుగరు, పడవలో మధ్య కలిగిన బాధ లెల్ల !"

రామారావు అర్థం కానట్టు చూశాడు.

"ఏముంది యింత దౌర్భాగ్య మింత కన్న ? చచ్చిపోదా మన్నా చావురాదు."

"ఎలావస్తుంది ? కర్మ వున్నంతవరకు బ్రతకాల్సిందే"

"అవును డాక్టర్ ! ఇప్పుడు కర్మ ని నమ్మాల్సివస్తోంది. ఆ కలే రాకపోతే !"

"కలా ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"చెప్పమంటావా ?"

"చెప్పు"

"వినలేవేమో ?"

"నేనా ?" అన్నాడు నవ్వుతూ.

"ఎంత డాక్టరువైనా మానవుడివేగా, నీకు మనస్సుంది, స్వార్థంవుంది. రక్త మాంసం, ఈర్ష్యాద్వేషం, ప్రేమాసూయలు అన్నీ వున్నాయి. ఈ విషాదగాథ నిన్ను కలవరపెట్టవచ్చు."

"మొత్తానికి రచయిత వనిపించావు" అన్నాడు నవ్వుతూ.

"లేదు డాక్టర్ ! ఈ అనుభవం నా జీవితంకన్నా పెద్దది. అందుకే ఇంతబాధ; ఆమె కలలోకి వచ్చింది."

"ఎవ రామె ?"

"దీప మార్పు. ఈ వెలుగులో ఆమెపేరు చెప్పలేను." అన్నాను కంపిస్తున్న కంఠంతో.

రామారావు దీపం ఆర్పేశాడు. చీకటి స్వార్థపరుడి మనస్సులా అలుముకుంది. విధి పరిహసించినట్లు గదినిండా నాట్యం చేస్తూ తిరిగింది. రామారావు ముఖం చీకట్లో నల్ల బడిపోయింది. నేను చెప్పసాగాను.

రామారావు ఆసక్తితో వినసాగాడు.

## 6

ఎందుకో రామారావు ఇంటికి వెళ్ళా లని పించింది ఈ సాయంకాలం, పదిహేను రోజులుగా అతను నన్ను కలవలేదు.

రామారావుకారు వాకిట్లో వుంది. మసక చీకటి వ్యాపిస్తోంది.

"రామారావు" అన్నాను తలుపు తట్టి.

ఎవరూ పలకలేదు. లోపలినుండి బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి, ఒకగొంతు రామారావుది.

"మీరు నన్ను నవసరంగా అనుమా నిస్తున్నారు."

"అనవసరం ! నాకు స్పష్టంగా చెప్పాడు అతను. మీ రిద్దరూ కాలేజీలో చదువుకున్నా రని, ప్రేమించుకున్నా రని —"

"అంతేనా ? ఇంకేం చెప్పలేదా ?"

"ఏం చెప్పలేదు."

"మీరు విని వుండరు."

"ఏం చెప్పా డని నువ్వు అనుకుం టున్నావు."

"అది నేను చెప్పలేను మీకు."

"ఏం చెప్పగలవు ? నేను తలెత్తుకొని ఎలా తిరిగేది? ఎవరిముఖం చూసేది ? నా భార్య కులట అని తెలిస్తే ఇంకేముంది? ఎంత అప్రతిష్ఠ !"

రామారావు కంఠంలో ఆవేదన కనిపిం చింది.

కథ అర్థమైంది. నా తల తిరిగిపోయింది. కల్యాణి, రామారావు భార్యా ! అయ్యో ! నే నెంత పొరపాటు చేశాను ? ఇప్పుడేం చేయటం ?

"నువ్వు నన్ను మోసంచేశావు. ని న్నేం చేశాను ? ప్రాణప్రదంగా ప్రేమించాను. అంతేనా నేను చేసిన తప్పు ?"

వేడి నిట్టూర్పు !

"నే నెవర్నీ మోసంచేయలేదు. నేనే వంచింపబడ్డాను."

"కాని ఫలితం అనుభవించేది నేను."

కల్యాణి జవాబు చెప్పలేదు.

"నీ బాహ్య సౌందర్యాన్ని చూచి మురిసి పోయాను. నీ బాహ్య సౌందర్యంతో సమా నంగా ఆత్మ సౌందర్యాన్ని ఎంచి చూడడంలో నేను పొరబడ్డాను. నీ ఆత్మ మలినమైనది ! గుణంలో వున్న రూపాన్నిచూసి ఎంతకాలం హర్షిస్తామో రూపంలోవున్న గుణాన్నిచూసి అంతకాలం హర్షించలేం ! సత్యం దాగదు. అదెప్పుడూ జగద్వ్యాప్తమయ్యే వుంటుంది" అన్నాడు రామారావు ఆవేశంతో.

"లేదు. మీ మనస్సుముందు రంగుటద్దం పెట్టుకున్నారు. నేనా రంగుతోనే మీకు కని పిస్తున్నాను."

"కల్యాణీ, నామీద ఒట్టు వేసి చెప్పు. అతను నీకు తెలుసా ?"

"తె...లు...సు !"

"ఎలా తెలుసు ?'

"కాలేజీలో చదువుకున్నాం."

"అతన్ని ప్రేమించావా ?"

"ప్రేమించాను !" ఛెళ్ళున మోత. నా మనస్సు సుడిగుండాలలో పడి గిరగిర తిరిగింది. తీరని భయంతో వణికిపోయాను.

"ఇంకా ప్రేమిస్తున్నావా ? "

"ప్రేమిస్తున్నాను. కాని మీరు వూహించే దృష్టిలోకాదు. నాకు అతనిమీద కోరికలేదు. నాప్రేమ అసంగమే ?"

రామారావు మాట్లాడలేదు.

"అతను సుఖపడటం నా క్కావాలి. ఒక నాడు ఇద్దరం పేకమేడలు కట్టుకున్నాం. కాని ఏనాడూ కాలుజారలేదు. అతను నన్నా రాధించాడు. అంతే !"

"ఆ...రా...ధ...న"

"జీవితంలో అన్ని రంగాలలోను ఓడి పోయాడతను. అతనికి సానుభూతి కావాలి; ప్రేమ కావాలి, శాంతి కావాలి ! ఆ రాత్రి నే నతనికి కర్తవ్యాన్ని గుర్తుచేశాను."

"నమ్మ మంటావా ?"

"నమ్మినా నమ్మకపోయినా చేయగలిగిం దేమీలేదు. సత్యం చెబుతున్నాను"

"సాక్ష్యం ?"

"నా అంతరాత్మ"

"పలకని నీ మూగ ఆత్మ నడగ మంటు న్నావా ? ఇది ఆత్మవంచనే —''

"మీరు చూడగలిగితే జవాబు దొరుకు తుంది."

"అది నా తప్పే. ఈ విషయం నాతో ఎందుకు చెప్పలేదూ ?" అన్నాడు తీవ్రంగా.

కల్యాణి జవాబు చెప్పలేదు.

"అంత ప్రేమించిం దానివి అత న్నెం దుకు చేసుకోలేదు ?" అన్నాడు తీవ్రంగా.

"దీని కేం జవాబు చెప్పను ? రూపాయ లలో జీవిత మధురిమని చూసే మా నాన్న నా జీవితాన్ని మీ దోసిట్లో క్రుమ్మరించాడు."

"విచారిస్తున్నావా ?"

"లేదు. నాబాధ్యత అనుకున్నాను."

"నీ కర్తవ్యం ఇదేనా ?"

"నా కర్తవ్యాన్ని నేను సరిగానే నిర్వ హిస్తున్నాను."

"నా జీవితాన్ని శూన్య మెందుకు చేశావు కల్యాణీ ?" అన్నాడు రామారావు ఏడుస్తూ.

ఒకసారి నా మనస్సు తిరగబడి దాడి చేసింది. ఎవరిది ఈ పాపం ? నా బ్రతుక్కి ఈ రెండోశాపం ఏమిటి ? నన్ను ఇక్కడి కెందుకు చేర్చావు భగవంతుడా ? ఈ విషాద సన్నివేశాన్ని సృష్టించి తిలకించటానికేనా ?

"నా జీవితం కలుష మైపోలేదు."

"ఎలా నమ్మను ?"

"నమ్మకపోవటం మీ బలహీనత.''

"ఈ అలుసుతోనేగా ఆపని చేశావు ?"

"ఏ పని ?"

"హాస్పటల్ కెందుకు వచ్చావు ? అతని కోసమేనా ?"

"అత నక్కడ వున్నా డని నాకు తెలీదు. అయినా అతన్ని ఓదార్చటం మినహా మరో తప్పు నేను చేయలేదు."

నా హృదయం క్షోభించి పోయింది. ఆవి రిలో మ్రగ్గిపోయింది.



''స్—స్—గొడవ చేయకండి. వీరు మనకంటె చక్కగా పాడేట్లున్నారు !"

"నీ హృదయం తెలుసుకోలేక పోయాను. ప్రేమించినందుకు ప్రతిఫలం బాగా పొందాను. ఈ లోకంలో ప్రేమకి గ్రుడ్డిగవ్వంత విలువకూడా లేదు. ఈ దాంపత్య బంధమంత మధురమైనది మరొ కటి లేదంటారు, కాదు. అది భ్రమ. ఆ బంధమంతా మిథ్య. నువ్వు మిథ్యాబింబానివి."

కల్యాణి మౌనంగా వూరుకుంది.

"మాట్లాడవేం కల్యాణీ''

"మీ రనవసరంగా ఈ సమస్యని భూతద్దం క్రింద చూస్తున్నారు."

"లేదు. నిన్ను నమ్మినందుకు శోకిస్తు న్నాను. నాకు సంపూర్ణత్వం ప్రసాదించవల సినది నువ్వు. కాని నా ఆనందాన్ని నాశనం చేశావు. ని న్నెలా శిక్షించను ?''

"నన్ను క్షమించలేరా !"

"క్షమా ? ఇంత జరిగేక ఆ మాటెలా నోటినుండి వచ్చింది."

"క్షమలేనిచోట ప్రేమ వుండి నిష్ఫలమే అవుతుంది, భర్తైన మీరే క్షమించలేక పోతే ఇంకెవరు క్షమిస్తారు ?"

"అవును. నేను నీ భర్తనికాను. ఇక నీకూ నాకూ ఏ సంబంధమూలేదు. నీ ముఖం నాకు చూపించకు."

"ఏ...వం...డీ !" అంది ఏడుస్తూ కల్యాణి.

"అంతే !"

"అం...తే...నా ?'' అంది కల్యాణి గాద్గదికంగా,

రామారావు మాట్లాడలేదు. రామారావు భళ్ళున తలుపు తీసికొని వెళ్ళిపోయాడు. ధైర్యంచేసి లోపలికి వెళ్ళాను. క్షణికో ద్రేకంయొక్క ప్రతిరూపం కల్యాణిలోచూడ గలిగాను. పగిలిన పొటాసియం సైనైడు నా కంతా చెప్పింది. కల్యాణిని చూడగానే. నా గుండె ముక్కలైంది. చెట్టుమీద పక్షులు లేచిపోయినట్లు నా భావాలు లేచిపోయినయి. నా హృదయం శూన్యమే అయింది. మెల్లగా కల్యాణిని నా ఒడిలోకి తీసుకున్నాను.

"కల్యాణీ'' అన్నాను విలపిస్తూ.

కల్యాణి జవాబివ్వలేదు. ఈ పాపం నాదే. నా ఈ దుఃఖమే విషమై కల్యాణిని చంపింది. నా ఆవేదనే కల్యాణిని పామై కాటు వేసింది. నా జీవిత లక్ష్య మిదేనా ?

నాకు జీవితంమీద యిచ్ఛ పోయింది. విరక్తి ఎక్కువైంది. జీవితం గులాబిముల్లు. కల్యాణి మరణించింది. ఈ షాక్ నుండి నేను కోలుకోలేను.

కల్యాణివంక చూశాను. బాధతో బాష్ప కణం రాలిపోయింది. సృష్టి అంతా గాఢ సుషుమ్నలో లీనమైనట్లుంది.

'కల్యాణీ'

అందమైన ప్రతివస్తువూ నిన్నే గుర్తు చేస్తుంది. సున్నితమైన ప్రతి భావంలోనూ నువ్వే మెదులుతావు. అలాంటి నిన్ను పోగొట్టుకున్న మేమిద్దరం దురదృష్టవంతులం!"

మరణం ఇంత సమీపంగా నాకెప్పుడూ కనిపించలేదు. ఈ దుఃఖభారంతో నా గుండె జడత్వాన్ని పొందింది. ఇక నేనెవరికీ అక్కర్లేదు. నాకెవరూ అక్కర్లేదు. జీవితంలోని అన్నిరంగాలలోనూ ఓడిపోయాను నేను. నాచుట్టూ చల్లని ఆవిరులు క్రమ్ముతున్నాయి. ప్రపంచం మూగదై పోయింది.

కల్యాణి చిరునవ్వులు నవ్వుతూ నన్ను పిలుస్తున్నది. కాలము, దూరము చేరువకు వచ్చినచోట దిగంతాల కవతల నన్ను పిలుస్తూ పోతున్నది. నా హృదయం మూగబోయింది. ఎక్కడో దివ్యతారగా వెలిగే కల్యాణికోసం భిక్షుకుడనై పరుగెత్తుకు పోతాను.

నా పాట ఆదిలోనే ఆగిపోయింది, పల్లవి అందుకోలేదు. ఆ వల్లకి ఇంక మ్రోగదు.

రేయి కడుపున దాగిన చీకటిలా నా గుండెలో కల్యాణి ఆవరించింది.

ఎవరహో ఈ నిశీధి
వెగసి నీడవోలె నిలిచి
పిలుతు రెవరో మూగకనుల
మోయలేని చూపులతో
ఎవరహో...

ఎవరిదా పిలుపు? నాకు తెలుసు. నేనా గొంతుని గుర్తుపట్టగలను. నా మౌనంలోంచే ఆ శబ్దం ఆవిర్భవించింది. కాని ఆ పిలుపులో శక్తిలేదు. నిండుతనం లేదు. ఇది ఒక అనుభూతి. ఒక వేదన. అదృశ్యంగా విశ్వమంతా వ్యాపించిన ఊహాతరంగం.

నాలో చైతన్యానికి చివరిదశ. ఇది నా గుండెల చివరి స్పందనం.

మెల్లగా కల్యాణిని మోసుకుని తూలుతూ జామచెట్టుక్రిందికి తీసుకు వెళ్ళాను. రాత్రి దిగులుగా జారిపోతున్నది. పగలు మృత్యువులా విజృంభిస్తుంది. చివరిసారి కల్యాణిని చూడాలనుకున్న కోరిక నెరవేరింది. కాని ఆ కల్యాణి ఇలాగేనా ఉండేది? ఈ శవరూపంలోనేనా నేను కల్యాణిని చూడాలనుకున్నది. ఈ లక్ష్యంతోనేనా నేను జీవించింది? యుగయుగాలనుండి పొందలేని న్యాయాన్ని ఈ విధంగా పొందిందా కల్యాణి? ఎందుకీ ఓటమి? జీవితంలో నటించటం చేతకానందుకా!

సముద్రాలు ఘోషపెడుతున్నాయి. అగ్నిపర్వతాలు ప్రేలుతున్నాయి. ఇక ఆత్మవంచన చేసికోలేను.

జాడ తెలియని ప్రియతమా, నీ
నీడనైనా చూపుమా — ఇది వెర్రికోరికా.
కాదు. చూపుతుంది నాకుతెలుసు.

దూరంగా చెరువులోని కెరటాలు ఒడ్డును తాకి ఎవరికోసరమో నిరీక్షించి నిరాశగా వెనక్కి వెళ్ళుతున్నాయి. ఒంటరిగా ఒకపిట్ట గూడుకావల విలపిస్తూ తిరుగుతున్నది.

సమాధివద్ద పెట్టిన దీపం ఏడుస్తూ గతాన్ని తలుచుకుంటున్నది.

ఆ సమాధిమీద పాలపిట్ట ఏడుస్తూ కూర్చుంది.

నడుస్తున్నాను. నడుస్తున్నాను. కాళ్ళ క్రింద భూమి తిరిగిపోతున్నది. గడియారంలో జీవితం తరిగిపోతున్నది. గుండెల ఆఖరిచప్పుడు. దూరాన నక్కల కూతలు..రాలిపోయే పండుటాకుల సవ్వడి.. గాఢ సుషుమ్నలో మునిగిపోయాను.

కల్యాణిమీదకు వంగి మెల్లగా చుంబించాను. కాని ఈ అమృతం కలాణిని బ్రతికించలేదు. బహుశా నాలో పవిత్రతలేదేమో! శీతలత్వంలో దీర్ఘనిద్ర పోతున్నది కల్యాణి.

నా కేమీ తెలియటంలేదు. అచేతనస్థితిలో ఎంతోదూరం పయనించాను. క్రమంగా నా బాహ్యశరీరం మంచుబిందువుల ఆవిరులలో కలసిపోతున్నది. కల్యాణి నా సమీపంలోనే వుంది. రమ్మని చేతులు జాపి పిలుస్తున్నది. నిజమైన ప్రేమ ఎక్కడుందో అక్కడికే నేనూ పోతున్నాను. నా జీవితపు చివరి జలబిందువు. నాచరిత్రని జలమయం చేసి అనంతంగా మండుతున్న గతకాలపు అగ్నిగుండంలోపడి నశించటానికి సిద్ధంగా వుంది. ఎవర్ని బెదిరించి క్షమ సంపాదించుకోను? ఎవర్ని ఆజ్ఞాపించి ప్రేమను పొందగలను? ఇవి రెండూ పువ్వుకు పరిమళంలా స్వభావ సిద్ధాలు. వద్దనుకున్నా వీటికి దూరంగా పోలేను. మెల్లగా కళ్ళు తెరిచాను. నాచేయి వ్రాలిపోవటం నాకు అస్పష్టంగా కనిపించింది. మరొకవైపు నా చేయి పట్టుకుని తీసుకుపోవటానికి కల్యాణి దరహాస చంద్రికలు వెదజల్లుతూ నిలబడింది.

నా ఆత్మ జాగృతమై రెక్కలు విప్పుకుని లేచిపోతున్నది!

